క్లుప్తంగా

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

కండలేరులో 6.842 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.842 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చోరీకి యత్నించిన యువకులను చితకబాదారు



చోరీకి యత్నించిన సుమన్, విభూషణ్

కుప్పం రూరల్: చోరీకి యత్నించిన బిహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులను గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం కుప్పం మండలం దళవాయికొత్తపల్లెలో చోటుచేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన ముని కుటుంబ సమేతంగా ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లడంతో ఇంట్లో వికలాంగుడైన ముని అన్న మాత్రమే ఉన్నాడు. దీనిని గమనించిన సుమన్, విభూషణ్ అనే ఇద్దరు బిహారీ యువకులు ముని ఇంట్లో ప్రవేశించి దొంగతనానికి యత్నించారు. ఇంతలో ముని అన్న కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఆ యువకులను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు.

నగరిలో పోటెత్తిన ఓటర్లు

- ముగిసిన ఓటింగ్ ప్రక్రియ
- 82 శాతం పోలింగ్ నమోదు
- ఐదేళ్ల సుస్థిర పాలన, సంక్షేమానికి ప్రజల నుంచి విశేష స్పందన
- మరోమారు రోజమ్మ గెలుపు తథ్యం అంటున్న నగరి ఓటర్లు
- పోలింగ్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన మంత్రి రోజా



పోలింగ్ కేంద్రం వద్ద వీల్‌చైర్‌పై వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి

నగరి: నగరి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అన్ని మండలాలు, పట్టణాల్లో పోలింగ్ స్టేషన్లు తెరవక ముందే జనం క్యూలైన్లలో బారులు తీరారు. సాయంత్రం 6 గంటలైనా నగరి మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, చింతలపట్టెడ, కేవీపీఆర్ పేట, మండలంలోని దామరపాకం, వీకేఆర్ పురంలో ఓటర్లు బారులు తీరడంతో గేట్లు వేసి లోపల ఉన్న వారికి ఓటింగ్ ప్రక్రియను కొనసాగించారు. చెదురు ముదురు సంఘటనలు మినహా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వివాదాలు చోటు చేసుకునే ప్రాంతాలకు వెంటనే చేరుకుని అందరినీ దూరంగా పంపేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో మంత్రి ఆర్కే రోజా కుటుంబంతో పాటు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



నింద్ర పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న మంత్రి రోజా

పోలింగ్‌కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు, పోలింగ్ సిబ్బందికి, అధికారులకు పేరుపేరునా మంత్రి రోజా సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. 80 శాతానికి పైగా పోలింగ్ నమోదవడం శుభసూచకం అన్నారు. యువత, మహిళలు, పేద బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అందరూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల యుద్ధంలో రాష్ట్ర ప్రజలు ఓటుతో పెత్తందారులకు సమాధానం చెప్పారన్నారు. జగనన్న గెలుపు తథ్యం అని తెలిసిందన్నారు. నగరిలో ఎవరెన్ని కుతంత్రాలు చేసినా, కుల, కుట్ర రాజకీయాలు చేసినా జనం మాత్రం పట్టించుకోకుండా నిజాయతీగా తనకు మద్దతు పలికారని మంత్రి రోజా తెలిపారు.

పోలింగ్ సరళి పరిశీలన

నింద్ర: మండల కేంద్రం నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మంత్రి రోజా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతూ ఓటర్లు సజావుగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని కోరారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై ఆరా తీశారు. ఆమె వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

పుత్తూరులో ప్రశాంతం

పుత్తూరు: పట్టణంతో పాటు పల్లెల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ తీవ్రతకు భయపడిన జనం ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద లైన్లలో నిల్చున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులుతీరారు. శాసనసభ, లోక్‌సభకు రెండు ఓట్లు వేయాల్సి ఉండడంతో నెమ్మదిగా ఓటింగ్ జరిగింది. క్రాస్ ఓటింగ్‌కు అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఆచితూచి ఓటు వేశారు. మధ్యాహ్నం కాస్త పోలింగ్ నెమ్మదించినా, సాయంత్రం 4 గంటల నుంచి మళ్లీ వేగం పుంజుకుంది. మండల పరిధిలోని గేటుపుత్తూరు, పైడిపల్లి, పరమేశ్వరమంగళం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణలు జరిగాయి. తిమ్మాపురంలో ఓ కానిస్టేబుల్ ఓటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించడంతో ప్రజలు తిరగబడ్డారు. మంత్రి ఆర్కే రోజా పుత్తూరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు. వేపగుంట ఏఏడబ్ల్యూకి చెందిన కైలాసమ్మ రెండు రోజుల క్రితమే ఆపరేషన్ చేసుకోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, గిరిజాప్రసాద్, నరసింహులు, వెంకటేశ్వర్లు ఆమెను మంచంపై మోసుకొచ్చి ఓటు వేయించారు.

బారులు తీరిన ఓటర్లు

నింద్ర: మండలవ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్దఎత్తున విచ్చేశారు. సోమవారం ఉదయం నుంచే ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీశారు. మొత్తం 25 కేంద్రాల్లో 150 మంది ఎన్నికల సిబ్బంది ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. సీఐ సుబ్బరామి రెడ్డి ప్రతి కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పర్యవేక్షించారు. తహసీల్దార్ నాగమణి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



నగరిలో తొలిసారి ఓటు వేసిన యువకుడు



నగరి: కొత్తపేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



పుత్తూరులో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి రోజా



ఓటు వేయించేందుకు ఓ అవ్వను మంచంపై తీసుకొస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, తెరణిలో ..



పరమేశ్వరమంగళంలో బారులుతీరిన మహిళలు



నగరి: కేవీపీఆర్ పేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



నింద్ర పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



నింద్ర మండలంలోని ఎలకాటూరులో ఓటు వేసేందుకు భారీగా తరలి వచ్చిన మహిళలు

జీడీనెల్లూరులో టీడీపీ నీచరాజకీయం

- ప్రైవేటు బౌన్సర్ల పేరిట రౌడీషీటర్లను దింపిన టీడీపీ అభ్యర్థి థామస్
- ఓటింగ్ నాడు కూడా స్క్రాచ్ కార్డు పేరిట ఓటర్లను మభ్య పెట్టిన వైనం
- ఓటు వేస్తే రూ.5 వేల వరకు కార్డు పొందవచ్చని ఓటర్లకు ఎర
- మండలాల్లో చెదరు ముదురు ఘటనలు
- జీడీనెల్లూరులో బలంగా వీచిన ఫ్యాన్ గాలి

కార్వేటినగరం: నియోజకవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం చెదురు మదురు ఘటనలతో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గస్థాయిలో 79.90 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నడూ లేని కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

శృతిమించిన టీడీపీ ఆగడాలు..

టీడీపీ అభ్యర్థి థామస్ చెన్నై నుంచి ప్రైవేటు బౌన్సర్ల ముసుగులో రౌడీషీటర్లను తీసుకొచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నూరులో పోలింగ్ బూత్ వద్దకు చేరుకుని మీరు ఎవరు ? ఎందుకు వచ్చారని నిలదీయడంతో టీడీపీ అభ్యర్థి థామస్ వాగ్వాదానికి దిగారు. దీనిపై మంత్రి స్పందిస్తూ చెన్నై నుంచి రౌడీషీటర్లను తీసుకొచ్చి ఓటర్లను ఇబ్బంది పెడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి చెదరగొట్టారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లేనిపక్షంలో నిరసనకు దిగుతామని మంత్రి హెచ్చరించడంతో కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటకృష్ణ హామీ ఇచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ ఓటింగ్ నాడు కూడా నీచరాజకీయాలకు తెరలేపారు. రూ.500 విలువ చేసే స్క్రాచ్ కార్డులు లాంటివి పంపిణీ చేస్తూ టీడీపీకి ఓటు వేస్తే మీ ఖాతాల్లో రూ.5 వేలు జమ అవుతాయని చెప్పి పంచారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి, కృపాలక్ష్మి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తమ స్వగ్రామం పాదిరికుప్పంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా జెడ్పీటీసీ పరంజ్యోతి కూడా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి, మాంబేడు, పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో బారులు తీరడంతో 5 గంటల్లోపు క్యూలో ఉన్నవారు రాత్రి 9 గంటల వరకు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

స్క్రాచ్ కార్డుల పేరిట ప్రలోభాలు..

టీడీపీ అభ్యర్థి థామస్ జీడీనెల్లూరులో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు స్క్రాచ్ కార్డులు పంపిణీ చేశారు. ఆ కార్డులను ఏ షాపింగ్‌మాల్‌కు, లేదా సూపర్ మార్కెట్ కానీ తీసుకెళ్లినా రూ.5000 విలువజేసే సరుకులు తీసుకోవచ్చని ఓటర్లను మభ్య పెట్టారు. అయితే ఓటర్లు వాటిని తీసుకోవడానికి ఇష్టపడలేదు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తహసీల్దార్ సుబ్బులక్ష్మమ్మ తెలిపారు. మండలంలో 17,827 ఓటర్లు ఉండగా 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో 83 శాతం ఓటింగ్ జరగ్గా, మొత్తం 14,643 ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ తెలిపారు. ఎస్‌ఐ భారతి గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ శ్యామల పాలసముద్రం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి వేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: చెదురుముదురు సంఘటనలు మినహా మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్‌కేంద్రాల వద్ద టీడీపీ నాయకులే హంగామాలు చేశారు. దేవళంపేటలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిపై టీడీపీ నాయకుల సతీష్ నాయుడు దాడికి ప్రయత్నించారు. పోలింగ్ సరళిని పరిశీలించేందుకు అక్కడికి వెళ్లిన కృపాలక్ష్మిని అడ్డగించి కులం పేరుతో దూషించడంతో ఆమె వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జక్కిదొన పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ టీడీపీకి ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నా ప్రధాన రహదారిపై టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం చేయడంతో స్థానికులు వ్యతిరేకించారు.

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కర్ణాటక, తమిళనాడు ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. మండలంలో మహాదేవమంగళం పంచాయతీలోని పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులకు వచ్చిన అధికారులు తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు రిటర్నింగ్ అధికారి వెంకటశివకు ఫిర్యాదు చేయగా వెంటనే ఆ సిబ్బందిని విధుల నుంచి తప్పించి, వేరే సిబ్బందితో పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వచ్ఛందంగా భారీగా తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.



జీడీనెల్లూరులో క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు



శ్రీకావేరిరాజుపురంలో క్యూలో ఉన్న ఓటర్లు



పోలింగ్ కేంద్రం టీడీపీ అభ్యర్థి థామస్ చెన్నై నుంచి తీసుకొచ్చిన రౌడీషీటర్ల హల్‌చల్, జీడీనెల్లూరులో ఓటేసేందుకు ట్రైసైకిల్‌పై వచ్చిన డయాలసిస్ రోగి, కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు



మంత్రి నారాయణస్వామి స్వగ్రామం పాదిరికుప్పంలో ఉదయాన్నే బారులు తీరిన ఓటర్లు.



మొండివెంగనపల్లెలో బారులు తీరిన ఓటర్లు



జక్కిదొనలో రచ్చ చేస్తున్న టీడీపీ నాయకులు